31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శుక్రవారం, నవంబర్ 13 , 2026

పేజీలు : 8



శిశు మందిర్ పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం దారుణం

- కార్పొరేట్ కు ధీటుగా విద్యా సేవలందిస్తున్న శిశుమందిర్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

చురకలు ప్రతినిధి కరీంనగర్, నవంబర్ 12 : కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యను అందిస్తున్న సరస్వతి శిశు మందిర్ విద్యాలయాలపట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. దేశంలో ఎంతో మంది పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి ఉన్నతికి తోడ్పాటు అందిస్తున్న సరస్వతి శిశు మందిర్ లపట్ల పాలకులు రాజకీయ ధోరణితో వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఈ రోజు కరినగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విభాగ్ స్థాయి సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశాలకు దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్ రెడ్డి పాల్గొని, సమావేశంలో విద్యా సంబంధిత అంశాలు, విద్యార్థుల సమగ్ర వికాసం, ఆచార్యుల బాధ్యతలు, పాఠశాలల అభివృద్ధి తదితర విషయాలపై విలువైన మార్గదర్శనం చేశారు.ఈ సందర్భంగా కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమావేశంలో పాల్గొన్న విద్యావేత్తలతో చర్చించి విలువైన సూచనలు చేశారు. విద్యార్థుల్లో విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి వంటి సద్గుణాలను పెంపొందించడంలో శిశు మందిర్ విద్యావిధానం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సంస్కారం అలవడేలా చర్యలు తీసుకుంటోందన్నారు. శిశు మందిర్ లో విద్యను అభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. సరస్వతి శిశు మందిర్ విద్యాలయాలు దేశ భక్తి, క్రమశిక్షణ, నైతిక విలువలకు పట్టుగొమ్మలని కొనియాడారు. విద్యా విలువలను పెంపొందిస్తూ -మిగతా 2లో



జిల్లాలో 8, 209 మందికి కొత్త పెన్షన్లు మంజూరు

- 19 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 12: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత నిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. వేముల వాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి చేయూత నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా 8,209 మందికి పెన్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19వ తేదీ నుంచి కొత్తగా మంజూరైన పెన్షన్ నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 1,13,264 మందికి -మిగతా 2లో



ఖతర్‌లో అందర్ని ఆకట్టుకొన్న పెమ్మసాని చంద్రశేఖర్



- పల్లెలను ప్రేమించాలని ప్రవాసాంధ్రులను కోరిన మంత్రి

ఖతర్, నవంబర్, 12 : విదేశాలలో నివసిస్తున్న ప్రవాసాంధ్రులు కేవలం డిజిటల్ సంబంధమె కాకుండ మాతృ భూమితో భౌతిక బంధాన్ని కూడ పటి ష్ఠం చేసుకోవాలని, స్వదేశానికి వెళ్ళిన ప్పుడల్లా తమ పల్లెలలో గడపాలని కేంద్ర టెలికం సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హితువు పలికారు. తాను సుదీర్ఘ కాలం అమెరికాలో ఉన్నా మాతృభూమిలోని మూలాలను ఎప్పటికి మరువలేదని అందుకె రాజకీయాలలో వచ్చి ప్రజా సేవ చేస్తున్నానని ఆయన అన్నారు. విదేశాలలో కష్టపడి సంపాదించి వచ్చిన వారు డబ్బు రాజకీయాలతో నష్టపోవద్దని కూడ ఆయన సూచించారు. కనీసం ఒక పాతిక ఏళ్ళు విదేశాలలో డబ్బు సంపాందించిన అనంతరం ప్రత్యక్ష రాజకీయాలలో ప్రవేశించాలని ఆయన చెప్పారు. ఎక్కడ ఉన్నా తమ తమ -మిగతా 2లో

కార్పొరేట్‌కు ధీటుగా గుల్లకోట ప్రభుత్వ పాఠశాల

-జిల్లా విద్యాధికారి రాము



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 12 : ప్రైవేటు కార్పొరేట్ పాఠశాల కు దీటుగా ఎండపల్లి మండలం గుల్లకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో అభ్యసన సామర్థ్యాలు సాధిస్తున్నారని జగిత్యాల జిల్లా విద్యాధికారి కె,రాము కితాబిచ్చారు.గురు వారం ప్రాథమిక పాఠశాల గుల్లకోటకు చెందిన సానా రామకృష్ణారెడ్డి విరాళం ద్వారా ఆధునికరించిన ఒకటవ తరగతి గదిని డి ఈ ఓ ప్రారంభించారు.గుల్లకోట విద్యార్థులు మూడు రకాల రంగు రంగుల టీషర్ట్స్ ప్రభుత్వ యూనిఫామ్ షూస్ టై బెల్ట్ ధరించి మంచి క్రమశిక్షణతో నాణ్యమైన విద్యాబోధన ద్వారా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్య అభ్యసిస్తున్నారన్నారు.ఈ పాఠశాల విద్యార్థులు చాలా చక్కగా ఉపన్యసిస్తు న్నారని సమాజం తోడ్పాటు ద్వారా ఈ పాఠశాలను ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి అభివృద్ధిచేస్తున్నారని,ఆయనసేవలుఅభినందనీయమని, ఉపాధ్యాయ బృందం గ్రామ ప్రజాప్రతినిధులు దాతలు ఈ పాఠశాలఅభివృద్ధికి తోడ్పాటు ను అందించడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎం ఈ ఓ, సర్పంచ్, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

ఆటో ఓనర్స్, డ్రైవర్స్ మండల అధ్యక్షులుగా కుమార్



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 12 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం ఆటో, ఓనర్స్, డ్రై వర్స్‌అసోసియేషన్‌అధ్యక్షులుగా జూపాక కుమార్ ఎన్నికయ్యినట్లు ఓ ప్రకటన లో పేర్కొన్నారు. మత్తునూర్ గ్రామం మినహా మండలంలోని అన్ని గ్రామాల ఆటో ఓనర్లు పాల్గొన్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులుగా సిలువేరు తిరుపతి,వేల్పుల గంగారాం, సలాది మల్లేశం, తరాల తిరుపతి,ప్రధానకార్యదర్శి మూగల బాను, కార్యదర్శులుగా బాల్సాని రవి, కొప్పుల రత్నం,కొప్పుల సాగర్, బొమ్మగాని ప్రశాంత్,దొరిశెట్టి శ్రీనివాస్,కోశాధికారి పొరండ్ల శేఖర్,సభ్యులుగా మరో5 గురు ఎన్నికయ్యారు.

రోళ్లవాగు గేట్లు ఎత్తి పంటలకు నీళ్లు అందిస్తాం

-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 12: అటవీ అనుమతుల వల్ల రోళ్లవాగు ప్రాజెక్టు కొంత ఆలస్యమవుతోందని, రాష్ట్ర, ఢిల్లీ స్థాయి అటవీ అధికారులను కలిసి వినతి చేయడం జరిగిందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. రైతుల కోసం రోళ్లవాగు గేట్లు ఎత్తి పంటలు ఎండకుండా నీళ్లు అందిస్తామన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని అన్ని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. బీర్పూర్ మండలం కొల్వాయి గ్రామంలోని శ్రీ కోదండరామాలయ నూతన కార్యవర్గ సభ్యులు ఆలయ చైర్మన్ గుండ సురేష్, వైస్ చైర్మన్ శ్రీరాముల మురళి, అర్చకులు, గౌడ సంఘం అధ్యక్షులు పెద్దగౌడ్, పొన్నం లక్ష్మణ్ తదితరులు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంగుల లక్ష్మణ్, పీఏసీఎస్ చైర్మన్ నవీన్ రావు, వార్డు సభ్యులు నరేష్, గంగన్న, శ్రీనివాస్, నాయకులు ముక్క వెంకటేష్, యాదవ్, శ్రీనివాసరావు, రామకిష్ట, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 8,209 మందికి కొత్త పెన్షన్లు మంజూరు

మొదటి పేజీ తరువాయి... పెన్షన్లు అందుతుండగా, కొత్త పెన్షన్లతో కలిపి మొత్తం 1,21,473 మందికి ప్రతి నెలా పెన్షన్లు అందనున్నాయని వివరించారు. ఇందుకోసం ప్రభుత్వం నెలకు సుమారు రూ.25.97 కోట్లను ఖర్చు చేయనుందని పేర్కొన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలుస్తూనే, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంద న్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులు, గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితుల నుంచి పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించి అర్హులను ఎంపిక చేసినట్లు వివరించారు.ఈ నెల 18వ తేదీ వరకు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తామని, 19వ తేదీ నుంచి వారి బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ నగదు జమ అవుతుందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం ఉచిత బస్సు ప్రయాణం, వారి పేరిట ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, మహిళా సంఘాల ద్వారా పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల కుట్టింపు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలుకల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్లు వకులాభరణం శ్రీనివాస్, బొమ్మేన భాస్కర్, ఏగోలపు శ్రీనివాస్, గసికంటి ప్రభాకర్, పిల్లి కనకయ్య, ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రక్రియలో వేగం పెంచాలి

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 12: జిల్లాలో చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతంగా, పకడ్బం దీగా పూర్తి పారదర్శకతతో, నిర్దేశిత గడువు లోగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలె క్టర్, ఆర్డీవోలు, మండల తహశీల్దార్లు, భూ సర్వే శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ రీసర్వే పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే చేపట్టాల్సిన మొత్తం భూమి విస్తీర్ణం ఎన్ని ఎకరాలు ఉంది, ఇప్పటివరకు ఎన్ని ఎకరాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తి చేశారు, ఇంకా ఎన్ని ఎకరాల్లో సర్వే నిర్వహించాల్సి ఉందనే వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో ఇప్పటివరకు సాధించిన పురోగతి, మిగిలి ఉన్న సర్వే పనులు, వాటిని పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రక్రియను ప్రాధాన్యతగా తీసుకొని క్షేత్రస్థాయిలో పనుల వేగం పెంచాలని సూచించారు. రీసర్వేకు సంబంధించి ప్రతి మండలానికి నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సర్వే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. జిల్లాలో నిర్వహించే భూరి సర్వే ప్రక్రియలో కచ్చితంగా కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పనులను త్వరితగతిన డిసెంబర్ మొదటి వారంలోగా ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, మండల తహశీల్దార్లు, భూ సర్వే శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మండలాల వారీగా సర్వే పూర్తయిన విస్తీర్ణం, ఇంకా పెండింగ్‌లో ఉన్న భూముల వివరాలను ప్రతి రోజు ఎప్పటికప్పుడు సమీక్షించాలని, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నిర్దేశిత గడువులోగా జిల్లాలో రీసర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, లేనియెడల కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

శిశు మందిర్ పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం దారుణం

మొదటి పేజీ తరువాయి..... సమాజానికి గొప్ప నైతిక విలువలను అందిస్తూ అంకిత భావంతో పనిచేస్తున్న సరస్వతి శిశు మందిర్ విద్యాలయాల పట్ల రాష్ట్ర పాలకులు చిన్న చూపు చూడం సహించిరానిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్కాల సీతారాములు, పాక సత్యనారాయణ, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, తేళ్ల రాజమౌళి, ప్రధానోపాధ్యాయులు మోర రణదీర్, ఎలగందుల సత్యనారాయణ, బండారి కరుణాకర్, సాంబ శివరావు, కాటం రవీందర్ మరియు వివిధ పాఠశాలల ప్రతినిధులు, ఆచార్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖతర్‌లో అందర్ని...

మొదటి పేజీ తరువాయి...

ఊళ్ళతో సంబంధాలు కల్గి ఉండాలని, నిజాయితీ, నిబద్ధతతో ప్రజా సంబంధాలు పెంచుకోవాలని చెబుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో కూడ తెలుగుదేశం పార్టీ ఈ బంధం ద్వార ఓటర్ల ఆదరణ పొందినట్లుగా చంద్రశేఖర్ పెర్కొన్నారు. ఒక అంతర్జాతీయ టెలికం సదస్సులో పాల్గొనడానికి ఖతర్ కు వచ్చిన ఆయన నిమిషం తీరిక లేకుండా నిమగ్నమై ఉండి కూడ తెలుగు ప్రవాసీయులకు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో ఓపికగ్గా సమావేశమవుతూ వారికి హితబోధనలు చేయడం ద్వార అందర్ని ఆకట్టుకోన్నారు.

స్వతహాగా ప్రవాసీ అయిన ఆయన, అయిదు వేల కోట్ల రూపాయాలతో ప్రస్తుత లోక్ సభ సభ్యులందరికెల్లా సంపన్నుడు, యువకుడు, పార్టీ నాయకత్వానికి విధేయుడు, ప్రభుత్వంలో సమర్థుడిగా గుర్తింపు పేరొందిన పెమ్మసాని వ్యక్తిత్వం ప్రవాసీయులందర్ని ఆకర్షించింది. మంత్రి గౌరవార్థం బుధవారం రాత్రి రాయబారి డాక్టర్ కె.శ్రీకర్ రెడ్డి తన నివాసంలో విందు ఏర్పాటు చేయగా అందులో భారతీయ ప్రముఖులను ఆహ్వానించగా తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిని వీలయినంత ఎక్కువ మందిను పిలిచారు. ఈ సందర్భంగా తనను కలిసిన తెలుగు ప్రవాసీయులతో మాట్లాడుతూ 15 బిలియన్ డాలర్ల భారత్ నెట్ ప్రాజెక్టుల గూర్చి వివరిస్తూ డిజిటిల్ విప్లవ ఫలితాలను వివరించారు.తెలుగు రాష్ట్రాలతో సహా దేశవ్యాప్తంగా టెలికం టవర్లు నిర్మించినా వాటి నిర్వహణను గాలికు వదలడంతో అవి సక్రమంగా పని చేయకపోవడంతో సెల్ ఫోన్ల సిగ్నళ్ళ సమస్య ఏర్పడిందని అంటూ తాను మంత్రిగా పదవి భాద్యతలు స్వీకరించిన అనంతరం టవర్ల పని తీరును రెట్టింపు చేయడంతో ఆ సంఖ్య 20 వేల నుండి 50 వేలకు పెరిగిందని, దీన్ని మరో రెండు సంవత్సరాలలో 2 లక్షల 70 వేలకు పెంచడం ద్వార కనెక్టివిటిను అభివృద్ధి చేయాలనె లక్ష్యంతో ఉన్నట్లుగా పెమ్మసాని వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధి కొరకు టెక్నాలిజిను వినివిగా అందుబాటులోకి తీసుకోరావడం ద్వార పెట్టుబడులను ఆకర్షించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు యువ నాయకులు లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రవాసాంధ్రులకు వివరించారు. బుధవారం వివిధ సందర్భాలలో ప్రవాసాంధ్రులను కలుసుకోన్న ఆయన సాయంత్రం రాయబారి ఇంట్లో అందరితో కలిసి మాట్లాడారు. గురువారం సాయంత్రం కూడ ఖతర్ లోని తెలుగుదేశం పార్టీ వర్గాలతో కూడ ఆయన వేర్వేరుగా సమావేశమయ్యారు.

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గుంటూరు లోక్ సభ నియోజకవర్గానికి చెందిన ప్రతి ఒక్కర్ని కలుసుకోవడానికి పెమ్మసాని ఆసక్తి చూపారు. తన మోబైల్ పై ఫోన్ చేసిన ప్రతి ఒక్కరితో పలుకరించి హోటల్ కు పిలిపించారు. అంతకు ముందు, అంతర్జాతీయ సదస్సులో సైబర్ నేరాలకు సరిహద్దులు లేవని అన్ని దేశాలు కలిసి దాన్ని ఎదుర్కోవాలని, అందరు పాఠాలు నెర్చుకోవాలని మంత్రి అన్నారు. ఆర్థిక లావాదేవీలలో భారత్ సాధించిన పురోగతిను వివరించారు. తెలుగు రాయబారి వచ్చిన అనంతరం ఇది తొలి విందు సమావేశం కావడం మరియు కేంద్ర మంత్రి కూడ ఒకప్పుడు స్వయాన తెలుగు ప్రవాసీ కావడంతో దీనికి ప్రాధాన్యత సంతరించుకోంది. విందుకు హజరయిన తెలుగు వారందరు కూడ మంత్రి మరియు రాయబారితో తెలుగులో మాట్లాడడంతో అతికొద్ది మంది ఇతర రాష్ట్రాల ప్రముఖులు ఒకింత అసహానానికి గురయ్యారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు పరామర్శ



చురకలు ప్రతినిధి, కోరుట్ల, నవంబర్ 12 : ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను గురువారం కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ పరామర్శించారు. బుధవారం కథలాపూర్ పర్యటనలో భాగంగా ఆది శ్రీనివాస్ కాలికి గాయం కావడంతో, వేములవాడలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రిజ్వాన్ పాషా, విజయ్, వోలెపు రాజేష్, ఎడ్ల గణేష్, దర్శనం రాజు, ప్రశాంత్ పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ఘనంగా ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు



చురకలు విలేకరి, బీర్ పూర్, నవంబర్ 12 : బీర్పూర్ మండలం కోమన్ పల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో సర్పంచ్ సీపతి స్వాతి రమేష్ ఆధ్వర్యంలో ముందస్తు బాలల దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు సాక్స్, బాక్సులు, పెన్సిళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. పిల్లలు ఉత్సాహంగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం, ప్రధానోపాధ్యాయులు సమీనా బేగం, పంచాయతీ కార్యదర్శి గుడాల మధుసూదన్, కారోబర్ మ్యాద గంగారెడ్డి, మొగిలి లక్ష్మీ, దిగుట్ల రమ్య, బద్ది సత్తవ్వ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా స్థంభంపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 12 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభంపల్లి గుట్టపై స్వయంబుగా వెలిసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం భక్తుల ఆధరణ,దాతల సహకారం తోఅభివృద్ధి చెందుతుంది. గుట్టపైనున్న ఆలయానికి నీటి సదుపాయం కల్పించుట కు లక్ష్మీపూర్ కు చెందిన పన్నాల జీవన్ రెడ్డి ఒక లక్ష విరాళం అందజేయడంతో గురువారం గుట్టక్రిందనుండి పైపలైన్ పనులను ఆలయ కమిటీ చేపట్టింది.వారంలోగా పనులు పూర్తిచేయ నున్నట్లు తెలిపారు. గుట్టపైకి రహదారి నిర్మాణం,కళ్యాణ మండపం, ఆలయ ప్రాంగణంలో ఫ్లోరింగ్ పనులు భక్తుల సహకారంతో పూర్తయ్యాయి. ఆలయం వద్ద షెడ్డు నిర్మాణం,పార్కింగ్,తదితర అభివృద్ధి పనులు చేపట్టేది ఉందని,రాబోయే జాతరఉత్సవాల వరకు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టెందుకు భక్తులు తగిన సహకారం అందించాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.

అధికారం తలుపు తట్టినా.. ఆత్మసాక్షికే పట్టం



రాజకీయాల్లో అధికారం కోసం సిద్ధాంతాలను తాకట్టు పెట్టే నాయకులు ఎందరో. పదవుల కోసం పార్టీలు మార్చేవారు, ప్రత్యర్థులతో చేతులు కలిపేవారు, ప్రజాస్వామ్య విలువలను పక్కన పెట్టేవారు నిత్యం కనిపిస్తుంటారు. అలాంటి రాజకీయ వాతావరణంలో దేశ అత్యున్నత పదవి తన ముందుకు వచ్చినప్పుడు దానిని తిరస్కరించిన నాయకురాలి నిర్ణయం మాత్రం ప్రత్యేకంగా నిలుస్తుంది. అది త్యాగమా? వ్యూహమా? కుటుంబ భద్రతపై ఆందోళనా? లేక అంతరాత్మకు ఇచ్చిన ప్రాధాన్యమా?ఈ ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించే ప్రయత్నమే కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'. నవంబర్ 10, 2026న హార్పర్‌కాలిన్స్ ఇండియా ప్రచురణలో పాఠకుల ముందుకు వచ్చిన ఈ 544 పేజీల గ్రంథం, కేవలం ఒక రాజకీయ కుటుంబ చరిత్ర కాదు. ప్రేమతో భారతదేశంలో అడుగుపెట్టిన ఒక ఇటలీ యువతి.. కుటుంబ విషాదాలను ఎదుర్కొని, రాజకీయాల కేంద్రబిందువుగా మారి, అధికారానికి సంబంధించిన అత్యంత కీలక నిర్ణయం తీసుకున్న తీరు తెలిపే వ్యక్తిగత--రాజకీయ ప్రయాణం.

ప్రధాని పదవి.. ఒక నాయకురాలి అంతరంగ సంఘర్షణ

2004 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి విజయం సాధించింది. సోనియా గాంధీ ప్రధానమంత్రి కావాలని పార్టీ నేతలు, కూటమి భాగస్వాములు బలంగా కోరుకున్నారు. రాజకీయ పరిణామాలను బట్టి చూస్తే ఆమె ప్రధాని పదవి చేపట్టడం దాదాపు ఖాయమనే భావన నెలకొంది. కానీ సోనియా మనసులో మాత్రం మరో సంఘర్షణ సాగుతోంది.తన పిల్లలు రాహుల్, ప్రియాంకలతో ఎన్నికలకు ముందే ఈ అంశాన్ని చర్చించినట్లు ఆమె పుస్తకంలో పేర్కొన్నారు. ప్రధాని పదవిని స్వీకరించనని ముందుగానే చెప్పినప్పుడు పిల్లలు ఊపిరి పీల్చుకున్నారని వెల్లడించారు. ఆ తర్వాత కూటమి నేతలు ఆమెను ఒప్పించేందుకు ప్రయత్నించిన సందర్భంలో తన మనసు క్షణక్షణం మారిందని, ఒకవైపు పార్టీ కార్యకర్తల పట్ల బాధ్యత, ఓటర్ల నమ్మకం తనను పదవి స్వీకరించమని పిలుస్తుంటే.. మరోవైపు తన అంతరాత్మ దానిని నిరాకరిస్తోందని ఆమె రాసినట్లు ప్రచురితమైన పుస్తక భాగాలు వెల్లడిస్తున్నాయి.

కుటుంబ విషాదాలు.. అధికారంపై ఏర్పడిన భయపు నీడ

సోనియా గాంధీ రాజకీయ నిర్ణయాలను అర్థం చేసుకోవాలంటే ఆమె కుటుంబం ఎదుర్కొన్న రెండు తీవ్ర విషాదాలను విస్మరించలేం. 1984 అక్టోబర్ 31న ఇందిరా గాంధీ హత్య, 1991 మే 21న రాజీవ్ గాంధీ హత్య.. ఈ రెండు ఘటనలు ఆ కుటుంబ జీవితాన్ని శాశ్వతంగా మార్చాయి.ఇందిరా గాంధీ హత్య అనంతరం రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టడం పట్ల సోనియా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు ఆమె జ్ఞాపకాలు సూచిస్తున్నాయి. రాజకీయ అధికారం అంటే ప్రజాసేవకు ఒక అవకాశం మాత్రమే కాదు.. తమ కుటుంబానికి అది ప్రాణాంతక ప్రమాదంతో ముడిపడిన అనుభవం కూడా.

2004లో ప్రధాని పదవి ముందుకొచ్చినప్పుడు ఆ గతం ఆమె మనసులో మళ్లీ మేల్కొని ఉండవచ్చు. అయితే ఆమె నిర్ణయాన్ని కేవలం కుటుంబ భయంతోనే వివరించడం కూడా సరైంది కాదు. వ్యక్తిగత భద్రత, రాజకీయ పరిస్థితులు, ప్రజల నమ్మకం, కుటుంబ బాధ్యతలు, అంతరాత్మ.. ఇవన్నీ పరస్పరం ముడిపడిన అంశాలు.

అధికారం తిరస్కరణ.. త్యాగమా, రాజకీయ వ్యూహమా?

సోనియా గాంధీ ప్రధాని పదవిని తిరస్కరించిన నిర్ణయాన్ని రాజకీయ త్యాగంగా మాత్రమే చిత్రించడం ఒక కోణం. దానిని వ్యూహాత్మక నిర్ణయంగా విశ్లేషించడం మరో కోణం.ఆమె విదేశీ జన్మపై అప్పట్లో బీజేపీ సహా ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. సోనియా ప్రధాని అయితే ఆ వివాదం మరింత ముదిరి రాజకీయ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందని భావించినట్లు ఆమె తన ఆత్మకథలో ప్రస్తావించిన అంశాలు సూచిస్తున్నాయి.

ఎమర్జెన్సీపై ఆత్మపరిశీలన.. కుటుంబ వారసత్వానికి మించిన నిజాయితీ?

1975లో ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితి భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత వివాదాస్పద అధ్యాయం. పౌరహక్కుల పరిమితులు, ప్రతిపక్ష నాయకుల అరెస్టులు, పత్రికలపై ఆంక్షలు.. ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపాయి.సోనియా గాంధీ ఆత్మకథలో ఎమర్జెన్సీ నిర్ణయాన్ని తప్పిదంగా పేర్కొన్న అంశాలు చర్చకు వస్తున్నాయి. ఒక రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి, తన కుటుంబ చరిత్రలోని వివాదాస్పద నిర్ణయాలపై ఆత్మపరిశీలన చేయడం గమనించదగిన విషయం.అయితే ఆత్మకథలోని వ్యాఖ్యలను చరిత్రకు తుది తీర్పుగా స్వీకరించలేం. ఎమర్జెన్సీని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి అప్పటి ప్రభుత్వ రికార్డులు, పార్లమెంటరీ చర్చలు, న్యాయపరమైన పరిణామాలు, చరిత్రకారుల పరిశోధనలు అవసరం. కుటుంబ సభ్యురాలి జ్ఞాపకం ఒక ఆధారం మాత్రమే.. సంపూర్ణ చరిత్ర కాదు.

భగవద్గీత.. కర్తవ్య భావనకు ఆధ్యాత్మిక నేపథ్యం

సోనియా గాంధీ జీవితంలోని ఆసక్తికరమైన వ్యక్తిగత అంశాల్లో భగవద్గీత అధ్యయనం కూడా ఒకటి. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంతో ఆమెకు ఏర్పడిన అనుబంధం, కర్తవ్య భావనపై ఆమె ఆలోచనలకు నేపథ్యంగా నిలిచినట్లు పుస్తకానికి సంబంధించిన వివరాలు తెలియజేస్తున్నాయి.భగవద్గీతలోని నిష్కామ కర్మ సిద్ధాంతం.. ఫలాపేక్షకు అతీతంగా కర్తవ్యాన్ని నిర్వర్తించాలనే బోధన. రాజకీయాల్లో ఈ భావనను అన్వయించుకోవడం సులభం కాదు. ఎందుకంటే రాజకీయ నిర్ణయాలు వ్యక్తిగత సంకల్పంతో పాటు ప్రజల ఆకాంక్షలు, పార్టీ బాధ్యతలు, అధికార వ్యవస్థలతో ముడిపడి ఉంటాయి.

ప్రచురణ వివాదం.. రచయిత స్వేచ్ఛకు పరీక్ష

ఈ ఆత్మకథ విడుదలకు ముందే ప్రచురణ వివాదం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. తొలుత పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఈ పుస్తకాన్ని ప్రచురించాల్సి ఉండగా, రచయిత్రి బృందం, ప్రచురణకర్త మధ్య సంపాదకీయ మార్పుల విషయంలో విభేదాలు ఏర్పడ్డాయని వార్తలు వచ్చాయి.ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్, మత ఘర్షణలు, భారత్--చైనా సంబంధాలు, గల్వాన్ ఉద్రిక్తతలు వంటి అంశాలపై మార్పులు సూచించారని కొన్ని వార్తా కథనాలు పేర్కొన్నాయి. అయితే పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా మాత్రం సంపాదకీయ పరిశీలన, వాస్తవ నిర్ధారణ తన బాధ్యతలో భాగమని, తమ వైఖరిని సెన్సార్‌షిప్‌గా చూపడం సరైంది కాదని తెలిపింది. చివరకు భారతదేశంలో ఈ పుస్తకాన్ని హార్పర్‌కాలిన్స్ ప్రచురించింది.ఈ వివాదం మూడు కీలక ప్రశ్నలను ముందుకు తెస్తుంది. రచయిత తన అనుభవాలను స్వేచ్ఛగా నమోదు చేసుకునే హక్కు ఎంతవరకు ఉంది?

'బిలాంగింగ్'.. దేశానికి చెందిన భావన కంటే లోతైన అనుబంధం

ఇటలీలో జన్మించిన సోనియా గాంధీ, భారతదేశంలో తన జీవితాన్ని నిర్మించుకున్నారు. ప్రేమతో ప్రారంభమైన ఆమె ప్రయాణం కుటుంబ బంధాలుగా మారింది. ఆ బంధాలు విషాదాలతో పరీక్షించబడ్డాయి. ఆ తర్వాత రాజకీయ బాధ్యతలుగా పరిణమించాయి.

'బిలాంగింగ్' అనే పదం ఇక్కడ కేవలం ఒక దేశానికి చెందిన గుర్తింపును సూచించదు. ఒక వ్యక్తి తన జీవితాన్ని, తన అనుభవాలను, తన బాధ్యతలను ఏ నేలతో అనుసంధానించుకుంటాడో తెలిపే భావన.

ఆత్మసాక్షి ముందు నిలిచిన నాయకత్వం!

రాజకీయాల్లో పదవిని పొందడం ఒక విజయం కావచ్చు. కానీ పదవి స్వీకరించాలా వద్దా అనే నిర్ణయాన్ని తన విలువల ఆధారంగా తీసుకోవడం కూడా నాయకత్వానికి ఒక పరీక్ష.సోనియా గాంధీ 2004 నిర్ణయం భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేకమైనది. అయితే దానిని నిర్దోషమైన త్యాగంగా గానీ, పూర్తిగా రాజకీయ వ్యూహంగా గానీ ఒకే గీతలో చిత్రించలేం. ఆ నిర్ణయం వెనుక కుటుంబ విషాదాలు, వ్యక్తిగత సంకల్పం, రాజకీయ ఒత్తిళ్లు, దేశానికి సంబంధించిన బాధ్యత భావన.. అన్నీ ఉన్నాయని ఆమె జ్ఞాపకాల నుంచి అర్థం చేసుకోవచ్చు.అధికారం మనిషికి గుర్తింపునిస్తుంది. కానీ ఆ అధికారాన్ని స్వీకరించాలా, తిరస్కరించాలా అనే నిర్ణయంలో తన ఆత్మసాక్షిని వినగలగడం మనిషి వ్యక్తిత్వానికి కొలమానం.'బిలాంగింగ్' ఒక రాజకీయ నాయకురాలి జీవిత కథ మాత్రమే కాదు. అధికారం, కుటుంబం, దేశభక్తి, వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య బాధ్యతల మధ్య సాగిన అంతరంగ సంఘర్షణకు అద్దం. ఈ పుస్తకం సోనియా గాంధీని సమర్థించాలా, విమర్శించాలా అనే నిర్ణయాన్ని పాఠకులపై వదిలేస్తుంది. కానీ ఒక విషయాన్ని మాత్రం స్పష్టంగా గుర్తు చేస్తుంది: రాజకీయ నాయకుడి జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే అతను చేపట్టిన పదవులనే కాదు.. అతను తీసుకున్న నిర్ణయాల వెనుక ఉన్న మనిషిని కూడా చూడాలి.

(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్, సెల్: 9010128884)



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

-54 మంది లబ్ధిదారులకు చెక్కులు

అందజేసిన ఎమ్మెల్యే : డా.కల్వకుంట్ల సంజయ్



చురకలు ప్రతినిధి కోరుట్ల నవంబర్ 12 : కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కోరుట్ల పట్టణం,మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మొత్తం 54 మంది లబ్ధిదారులకు రూ.12,42,000(పన్నెండు లక్షల నలభై రెండు వేల రూపాయలు) విలువైన చెక్కులను అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో ఆగిపోతున్న గుండెలు

-కనుమరుగైన ప్రభుత్వ ఆర్థిక సహాయం

-మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి



చురకలు విలేకరి, రాయికల్, నవంబర్ 12 : గల్ఫ్ మృతులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం కనుమరుగైందని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. గల్ఫ్ దేశంలో మరణించిన పాలెపు రాజం పార్థివ దేహం గురువారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చేరుకోగా, పార్థివ దేహానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రవీందర్ నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కనీసం 10 శాతం జనాభా గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారని, తెలంగాణలో దాదాపు 10 లక్షల మంది విదేశాల్లో ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఒక మనిషికి నెలకు రూ.10 వేల చొప్పున లెక్కేసినా నెలకు రూ.1000 నుండి 1200 కోట్లు విదేశీ మారక ద్రవ్యం రూపంలో దేశానికి ఆదాయం వస్తోందని, ఏడాదికి దాదాపు రూ.12 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1000 కోట్ల వరకు ఆదాయం గల్ఫ్ కార్మికుల వల్ల వస్తోందన్నారు. గల్ఫ్ లో అకాలంగా మరణించిన వారికి ఆర్థిక సాయం చేయాలని తాను శాసనసభలో, మండలిలో ఒత్తిడి తెచ్చానని, పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తెచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటింపజేశానని, తాను గల్ఫ్ బోర్డులో మెంబర్ గా కూడా ఉన్నానని గుర్తు చేశారు. అన్ని పథకాల లాగే ఈ పథకం కూడా గత ఏడాది కాలంగా పెండింగ్ లో పెట్టారని, దాదాపు 200 మంది మరణించారని, రూ.10 కోట్లు ఇస్తే సరిపోతుందని అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోనే ఈ మధ్య 10 మంది గల్ఫ్ లో చనిపోయారని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులకు నెలనెలా జీతాలు పడినట్లు గల్ఫ్ లో మరణించిన కుటుంబాలకు కూడా గ్రీన్ ఛానల్ లో ఎక్స్ గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ లో చనిపోయిన వారి పిల్లలకు విద్యా సదుపాయం, భార్యకు వితంతు పెన్షన్, ఇల్లు లేని వారికి ఇల్లు మంజూరు చేయాలని, రైతు బీమా రద్దయిందని, కనీసం ఎక్స్ గ్రేషియా కూడా జాప్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీలు ఎక్కువగా ఉపాధి లేకనే గల్ఫ్ కు వెళ్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో గల్ఫ్ మృతుల కుటుంబాలకు ప్రాధాన్యత ఇచ్చి పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

కోటిలింగాల గోదావరి పుష్కర పనులు వేగవంతం చేయాలి

-పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 12 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణం తోపాటు గోదావరి పుష్కర అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. ఆయన గురువారం కోటిలింగాలలో జరుగుతున్న వివిధ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.గోదావరిలో ఎల్లంపల్లి ప్రాజెక్టునీటినిల్వ ఉండడంతో స్నానఘట్టాల నిర్మాణంలోఇబ్బంది కలిగే విషయాన్ని సంబంధిత ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా,నీటిని తొలగించే విషయంలోఉన్నతాధికారుల తో మాట్లాడి చర్యలు తీసు కుంటామని కలెక్టర్ తెలిపారు. ఆలయ సమీపంలో గోదావరి ఎల్లంపల్లి రిజర్వాయర్లో నీటి మట్టం పెరిగినప్పుడు నీరు ఆలయ సమీపంలోకిరాకుండా రిటర్నింగ్ వాల్ నిర్మించాలని సూచించారు. అవసరమైతే స్నానఘట్టాల నిర్మాణం విషయంలో డిజైన్ మార్చే అవకాశంగురించి చర్చించారు.ప్రస్తుత ఇరిగేషన్, దేవాదాయ,శాఖల పుష్కర అభివృద్ధి పనులతోపాటు వివిధ శాఖల కు సంబంధించి భక్తులకు ఎలాంటి అసౌఖర్యం లేకుండా విద్యుత్తు, మంచినీటి,రవాణా,తదితరపనులు త్వరితగతిన చేపట్టి పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు.అర్చకులకుటీర నిర్మాణానికి చర్యలుచేపట్టాల ని తెలిపారు.అన్ని శాఖలకు సంబందించిన అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా పక్కా ప్రణాళికతో పుష్కరాల సమయం లోపు అన్ని పనులు పూర్తిచేయాల ని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఆర్డీఓ మధుసూదన్, తహశీల్దార్ శేఖర్,ఎంపీఓ కృపాకర్, దేవాదాయ శాఖ ఏఈ సంతోష్ రెడ్డి, ఈవో కాంతారెడ్డి,సర్పంచ్ కోటయ్య, ఆలయచైర్మన్ పూదరిరమేష్, తదితర అధికారులు,ధర్మకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి వనరులను సంరక్షిస్తూ

వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

-కోరుట్ల ఏడీఏ రమేష్



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (12) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట గ్రామంలో ఖేతీ బచావో అభియాన్‌లో భాగంగా రైతులకు వ్యవసాయంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఏడీఏ రమేష్, ఆత్మ డీపీడీ సుధాకర్ రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాల పరిమిత లభ్యత, నీటి వనరుల సంరక్షణ తదితర అంశాలపై వివరించారు.ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకొని రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వరి సాగుకు బదులుగా తక్కువ నీటిని వినియోగించే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ప్రకృతి వనరులను సంరక్షిస్తూ స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించినప్పుడే భవిష్యత్తులో వ్యవసాయాన్ని లాభసాటిగా కొనసాగించవచ్చన్నారు.ఈ కార్యక్రమం లో కోరుట్ల ఏడీఏ రమేష్, ఆత్మ డీపీడీ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి ఆకు రాజ్‌కుమార్, సర్పంచ్ కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఏఈఓ వినోద్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లకు పూర్తిస్థాయి 100 పడకల

ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

-బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా



చురకలు ప్రతినిధి కోరుట్ల, నవంబర్,12 : కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, అందుకు అవసరమైన వైద్యులు, సిబ్బంది, అన్ని రకాల వైద్య సదుపాయాలను తక్షణమే కల్పించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై. అనూప్ రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పాదయాత్రగా బయలుదేరి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు డాక్టర్ రాచకొండ యాదగిరి బాబు, ఐఎంఏ రాష్ట్ర మహిళా విభాగం చైర్మన్ డాక్టర్ స్వాతి అనూప్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. 100 పడకలకు అనుగుణంగా స్పెషలిస్ట్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు. అలాగే అత్యాధునిక వైద్య పరికరాలు, అవసరమైన మందులు, అత్యవసర చికిత్సకు సంబంధించిన అన్ని సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు రుద్ర శ్రీనివాస్, గుంటుక సదాశివ్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు గుత్తిల తుకారాం గౌడ్, జిల్లా కార్యదర్శి సుదవేని మహేష్, ఎండోమెంట్ జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ మాడవేణి నరేష్, ఇందూరి తిరుమల వాసు తదితరులతో పాటు వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ, మండల అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, రాష్ట్ర, జిల్లా నాయకులు, బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థి దశలోనే శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలి

-జిల్లా విద్యాధికారి శారద



చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి కమాన్‌పూర్ నవంబర్ 12 : 32వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా స్థాయి ప్రాజెక్ట్స్ ప్రెసెంటేషన్ కార్యక్రమం బుధవారం పెద్దపల్లి బాలికల ఉన్నత పాఠశాల లో జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా లో ఉన్న 76 పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఇన్నోవేషన్ ఫర్ సృష్టినీ బిలిటి అనే ప్రధానాంశం మీద విద్యార్థులుప్రాజెక్ట్స్ రూపొందించి ప్రెసెంట్ చేశారు.జిల్లా సైన్స్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ కానుగంటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం నకు సమన్వయ కర్తగా ఎం.నరేష్ వ్యవహరించడం జరిగింది. ముఖ్య అతిధి గా హాజరు అయిన జిల్లా విద్యాధికారి శ్రీమతిశారద మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మంచి విజ్ఞానం గ్రహించి భవిష్యత్ తరాలకు చక్కని మార్గం చూపే విదంగా పరిశోధనలు జరుపాలని,విద్యార్థి దశ లొనే శాస్త్రీయ అభిరుచి కలిగి ఉండాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిధిగా పాల్గొన్న జిల్లా సైన్స్ అధికారి హన్మంత్ సార్ మాట్లాడు తూ చీజూజ కార్యక్రమాలు పెద్దపల్లి జిల్లాకు జాతీయ స్థాయిలో అనేక సార్లు మంచి గుర్తింపు తెచ్చినాయి అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ, హరిప్రసాద్,జడ్జెస్ శంకర్, సతీష్‌లతో పాటు గైడ్ టీచర్స్, స్టూడెంట్స్ పాల్గొన్నారు.అనంతరం జరిగిన ప్రాజెక్ట్స్ ప్రెసెంటేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు ప్రదర్శనల ద్వారా జడ్జిమెంట్ పొందారు .ఇందులో విజేతలుగా పి. వైష్ణవి(జిల్లా పరిషత్ హై స్కూల్ రాగినేడు పాఠశాల) .జి. సాకేత్ (సెయింట్ క్లెయిర్ ఎన్టిపిసి) . డి. సాయి తేజ జిల్లా పరిషత్ గర్ల్స్ గోదావరి ఖని). పి.అద్రీత్ (ట్రినిటీ పెద్దపల్లి) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు.

గంజాయి మహమ్మారిని తరిమికొడదాం



చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి) కమాన్ పూర్ నవంబర్ 12 : గంజాయి మహమ్మారిని తరిమికొట్టే బాధ్యత మనందరిపై ఉందని ఎస్పీ నాయక్ మహారాజ్ ఏలియా సోమ్లాదాదా మోటివేషన్ స్పీకర్ అన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ గంజాయి నిర్మూలనపై తాము తెలంగాణలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎన్నో ప్రదేశంలో ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డిసిపి బలరాం రెడ్డి ఆదేశాల మేరకు గత సంవత్సర కాలంగా పెద్దపల్లి జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రదర్శనలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై పూనుకోవాలని అన్నారు. ఈ గాంజా మహమ్మారి విద్యార్థుల బతుకులను శీద్రం చేస్తుందని కొన్ని దుష్ట శక్తులు విద్యార్థులను పెడదారిన పట్టించి వారికి గంజాయి అలవాటు చేస్తున్నారని అన్నారు. నేడు గంజాయిని చాక్లెట్ రూపంలో సైతం అందజేయడం జరుగుతుందని తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే తమ పిల్లల భవిష్యత్తు మారుతుందని లేకుంటే వారి భవిష్యత్తు చీకటి మయంగా మారుతుందని అన్నారు. గంజాయి విక్రయదారులు ముఖ్యంగా కళాశాలలు పాఠశాలల వద్ద మఖాంవేసి విద్యార్థులకు గంజాయి అలవాటు చేస్తున్నారని దీంతో విద్యార్థులు గంజాయి కి బానిసలై పోతున్నారని పేర్కొన్నారు.ఈ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని లేనియెడల విద్యార్థుల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని స్పష్టం చేశారు. ప్రజలను యువతను మేలుకొల్పేందుకే గ్రామాల్లో గంజాయి నిషేధంపై ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు.యువత భవిష్యత్తు తమ తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని కాపాడుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి గంజాయి కి దూరంగా ఉండి ఉన్నత చదువులు చదువుకుంటే మీ జీవితం బంగారు బాట వేస్తుందని ఇకపై గంజాయి మహమ్మారిని యువత తరిమికొట్టాలని సూచించారు.

ముత్యంపేటలో పండ్ల మొక్కల పంపిణీ



చురుకలు విలేకరి,మల్యాల నవంబర్ 12 : జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామపంచాయతీలో ఫాతిమా నగర్ అర్బోరేషన్ ఆధ్వర్యంలో పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ముత్యంపేట సర్పంచ్ ఆదిరెడ్డి చేతుల మీదుగా రైతులకు తైవాన్ జామ,కొబ్బరి,అల్ల నేరేడు, దానిమ్మ తదితర పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.రైతులు తమ పొలంలో, ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పలురకాల పండ్ల మొక్క జాతులను సంరక్షించాలని సర్పంచ్ ఆదిరెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఈవో శేఖర్, సంస్థ ప్రతినిధి మల్లేశం,ముత్యంరెడ్డి, దూస వెంకన్న, అంజిరెడ్డి, రఘు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుపై ఆరోపణలు అవాస్తవం

- ఖండించిన కాంగ్రెస్ కార్యకర్త గువ్వల మల్లేష్



చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 12 : మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబుపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని చిన్న ఓదాల గ్రామ కాంగ్రెస్ కార్యకర్త గువ్వల మల్లేష్ ఒక ప్రకటనలో ఖండించారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం మంత్రి శ్రీధర్ బాబు అహర్నిశలు కృషి చేశారని, నియోజకవర్గ కార్యకర్తలందరికీ పిలుపునిచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు ఎంపీ గడ్డం వంశీ, ప్రత్యర్థి పార్టీ అయిన బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ నాయకులతో లోలోపల కుమ్మకై మంత్రి శ్రీధర్ బాబుపై ఆరోపణలు చేస్తూ ప్రెస్‌మీట్లు పెట్టిస్తున్నారని ఆరోపించారు. ఇది తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్లుగా ఉందని విమర్శించారు. ఇప్పటికైనా తమ పద్ధతులు మార్చుకుంటే రాబోయే రోజుల్లో మంచిదని, కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టవద్దని హెచ్చరించారు. నాటి నుండి ఇప్పటివరకు గడ్డం కుటుంబం ఎన్నో ఏళ్లుగా పరిపాలిస్తున్నా, తమ గ్రామం చిన్న ఓదాలకు పావుల పైసా పని అయినా చేశారా అని ప్రశ్నించారు.ఒకసారి వెరిపై చేసుకోవాలని కోరారు. నిన్న తమ గ్రామానికి చెందిన చిత్తవేణి హరీష్ పూర్తిగా అవగాహన లోపంతో మాట్లాడారని, దానిని ఖండిస్తున్నామని గువ్వల మల్లేష్ తెలిపారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లపై కలెక్టర్ సమీక్ష



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 12 : అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందించడంతో పాటు, లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సోన్ మండలంలోని సంగెంపేట్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్లకు కల్పించిన విద్యుత్, రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇళ్లలో నివసించేందుకు అవసరమైన అన్ని వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింప జేయడం ద్వారా భూగర్భ జలాలను సంరక్షించవచ్చని, ఈ దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం గ్రామస్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ వికసిత్ భారత్ – ఉపాధి, జీవనోపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, గృహ నిర్మాణ శాఖ డీఈ గంగాధర్, సర్పంచ్ విలాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలి



చురకలుప్రతినిధి మంథని, నవంబర్ 12: పుట్టపాక సర్పంచ్ కన్నూరి రాజబాబును అసభ్య పదజాలంతో దూషించిన తిరుపతి రెడ్డిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మంథని లక్ష్మణ్, బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు తగరం శంకర్ లాల్, దళిత సేన రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు గద్దల శంకర్, మంథని మండల మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య, దళిత సేన డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్ మాట్లాడారు. నగరంపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు పోరెడ్డి తిరుపతి రెడ్డి, సర్పంచ్ రాజబాబును అవమానకరంగా మాట్లాడారని వారు ఆరోపించారు. ఇది హేయమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ రాజబాబును అవమానించిన తిరుపతి రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడమే కాకుండా, అరెస్ట్ చేసి చట్ట ప్రకారం ఎస్సి ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు ఇప్పటికైనా జాప్యం చేయకుండా తిరుపతి రెడ్డిని అరెస్ట్ చేసి ప్రజలకు నమ్మకం కలిగించాలని కోరారు. 24 గంటలలో అరెస్ట్ చేయకుంటే మంథని నియోజకవర్గ బంద్ ప్రకటిస్తామని, పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్ మండలాలకు చెందిన దళిత సంఘాల నాయకులు ఆసం తిరుపతి, కన్నూరి ఓదెలు, కడారి సంపత్, దేవన్న, విజయ్ కుమార్, కాసిపేట సాగర్, పుల్లూరి బాబు, జనగామ సంతోష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎంపీ కార్యక్రమానికి వెళ్తే సస్పెండ్ చేస్తారా..?



చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి కమాన్‌పూర్ నవంబర్ 12 : సొంత పార్టీ ఎంపీ కార్యక్రమానికి హాజరైతే సస్పెండ్ చేస్తారా..అంటూ కొయ్యూరు గ్రామ ఉపసర్పంచ్ లకవత్ సవేందర్ ప్రశ్నించారు. తమపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ఆయన, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీముద్దీన్ డిమాండ్ చేశారు.గురువారం పెద్దపల్లి కమాన్ రోడ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎంపీ గడ్డం వంశీకృష్ణ కొయ్యూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి ఆహ్వానం మేరకు హాజరయ్యామని తెలిపారు. అదే రోజు సాయంత్రం మండల అధ్యక్షుడు జంగిలి శ్రీనివాస్ తమను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారని పేర్కొన్నారు. ఎలాంటి సంజాయిషీ నోటీసు ఇవ్వకుండా, ఫిర్యాదు కాపీ చూపించకుండా చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకే సస్పెండ్ చేసినట్లు మండల అధ్యక్షుడు చెప్పారని తెలిపారు. ఇప్పటికే గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమారరావుకు వినతిపత్రం అందజేశామని, సస్పెన్షన్ ఎత్తివేయకపోతే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి భూమయ్య పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ రూ. 10 వేల ప్రోత్సాహకం



చురకలు ప్రతినిధి
హుజూరాబాద్ నవంబర్ 12 : హుజురాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాలలో హుజురాబాద్‌లో మండల ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని కుమారి కళ్లెపు "అభినవశ్రీ" కి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ రూ. 10,000/-ల చెక్కును ప్రోత్సాహక బహుమతిగా గురువారం అందజేసింది. ఈ చెక్కును అభినవ శ్రీ తల్లిదండ్రులైన క్రాంతి కుమార్, రజిని దంపతులకు మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డివిజనల్ మేనేజర్ సతీష్ కుమార్, హుజురాబాద్ బ్రాంచ్ మేనేజర్ రాజేష్ ఖన్న అందించారు. ఈ సందర్భంగా మండల విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ అభినవ శ్రీ భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను మాత్రమే ప్రోత్సహిస్తూ ఈ బహుమతి ప్రధానం చేయడం పట్ల శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ యాజమాన్యాన్ని ఎంఈఓ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. తద్వారా మరింత మంది విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు స్ఫూర్తి పొందుతారని తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డివిజనల్ మేనేజర్ సతీష్ మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గస్థాయి మరియు మండల స్థాయిలలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు క్యాష్ అవార్డు అందజేశామని తెలిపారు. హుజురాబాద్ బ్రాంచ్ మేనేజర్ రాజేష్ ఖన్న మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరం కూడా ఇలాంటి బహుమతులు అందజేస్తామన్నారు. జిల్లాస్థాయిలో మన హుజురాబాద్ విద్యార్థి అందుకోవాలని విద్యార్థులను కోరారు. ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గంకిడి సమ్మిరెడ్డి, ప్రస్తుత బాలుర ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు భవాని, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

-విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ,కష్టపడి చదివే అలవాటును అలవరచుకోవాలి:
-పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి



చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జబ్బార్ ఖాన్) కమాన్ పూర్,నవంబర్ 12 : విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం రామగిరి మండలం చందనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ పర్యవేక్షణలో, గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో డ్రగ్స్ దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత,చెడు అలవాట్లకు దూరంగా ఉండటం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించారు .ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి, ప్రవచనకర్త ఎస్వీ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ భూక్య రామ్ రెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా వారి చదువు, వ్యక్తిత్వం,కుటుంబ పరిస్థితులు, భవిష్యత్తును కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు.విద్యార్థులు చిన్న వయస్సులోనే చెడు అలవాట్లకు గురికాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సూచించే మంచి మార్గంలో నడవాలని సూచించారు. విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కష్టపడాలని అన్నారు. చదువు, క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం ,నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఏషియన్ గేమ్స్, ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ క్రీడా పోటీలతో పాటు వివిధ రంగాల్లో రాణించాలంటే విద్యార్థి దశ నుంచే కష్టపడి సాధన చేయాల్సిన అవసరం ఉందన్నారు.జీవితంలోని తొలి 20 సంవత్సరాలను చదువు,జ్ఞానం, నైపుణ్యాల సాధనకు కేటాయించి కష్టపడి పనిచేస్తే భవిష్యత్తులో జీవితాన్ని ప్రశాంతంగా, సంతోషంగా గడిపే అవకాశం ఉంటుందని తెలిపారు.అదే విద్యార్థి దశలో నిర్లక్ష్యం వహించి చెడు అలవాట్లకు బానిసైతే భవిష్యత్తులో అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీసీపీ సూచించారు. మత్తు పదార్థాలను ఎవరైనా వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా లేదా అక్రమంగా సరఫరా చేస్తున్నా వాటి గురించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులతో విద్యార్థులు నేరుగా ఘర్షణకు దిగకుండా, వెంటనే స్థానిక పోలీసులకు లేదా అత్యవసర సహాయ నంబర్ 112కు సమాచారం అందించాలని సూచించారు.సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, పోలీసులు తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని భరోసా ఇచ్చారు.అతి వేగం,నిర్లక్ష్యపు డ్రైవింగ్,మద్యం సేవించి వాహనాలు నడపడం,హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటి కారణాలతో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.తమ కుటుంబ సభ్యులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా విద్యార్థులు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంతో పాటు రోడ్డు ప్రమాదాలనివారణలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని డీసీపీ పిలుపునిచ్చారు. విద్యార్థులు మంచి నడవడిక, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తనను అలవర్చుకుంటే దాని ప్రభావం కుటుంబం,పాఠశాల, సమాజంపై సానుకూలంగా ఉంటుందని తెలిపారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు , పోలీసుల సూచనలను పాటిస్తూ,చెడు స్నేహాలకు దూరంగా ఉండి, చదువు మరియు తమ భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు.డ్రగ్స్‌కు నో చెప్పండి- రోడ్డు భద్రతా నియమాలను పాటించండి - క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించండిలి అని డీసీపీ విద్యార్థులకు పిలుపునిచ్చారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని

ప్రారంభించిన అదనపు కలెక్టర్

చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల నవంబర్ 12 : రైతులు పండించిన పత్తికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర అందించడంతో పాటు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలిపారు.కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని కావేరి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లతో పాటు కొనుగోలు కేంద్రంలో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, పత్తిలో తేమ శాతం ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులకు కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణ గౌడ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు,వైస్ చైర్మన్లు, పాలక వర్గ సభ్యులు,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, ఆత్మ కమిటీ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.



భూముల రీ సర్వే ప్రక్రియ పరిశీలన

కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, ఖచ్చితత్వంతో వివరాలు సేకరిస్తూ నమోదు చేయాలని ఆదేశించారు. రైతులకు సమాచారం అందించి, వారి సమక్షంలో భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని, రోజూ వారీగా లక్ష్యం నిర్దేశించుకుని దానికి అనుగుణంగా రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులన్నారు.పరిశీలనలో తహసీల్దార్ వరలక్ష్మి, నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్, డీఐ రాజేంద్ర ప్రసాద్, సర్వేయర్, తదితరులు ఉన్నారు.



ఎల్‌నినో దృశ్యా..

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన

-చెల్పూర్‌లో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం
-కేవీకే శాస్త్రవేత్త మహేష్



చురకలు ప్రతినిధి హుజూరాబాద్, నవంబర్ 12 : ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కేవీకే శాస్త్రవేత్త మహేష్ సూచించారు. గురువారం చెల్పూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ వంతడుపుల కస్తూరి అధ్యక్షతన వ్యవసాయ శాఖ, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మహేష్ మాట్లాడుతూ సాగునీటి లభ్యతను బట్టి వరి పంటకు బదులుగా పొద్దుతిరుగుడు, శనగ, మినుములు, కుసుమ వంటి ఆరుతడి పంటలు, పప్పు దినుసులు, నూనె గింజల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పూర్వం రైతులు అనుసరించిన సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను ప్రస్తుత తరం రైతులు కూడా ఆచరించాలన్నారు. పంటల సరళి, విత్తే సమయం, పంటకాల వ్యవధిని పరిగణనలోకి తీసుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల సాగుతో పాటు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. తద్వారా ఆరోగ్యకరమైన నేలలో నాణ్యమైన పంట ఉత్పత్తులను పొందవచ్చన్నారు. హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత మాట్లాడుతూ యూరియా, డీఏపీ ఎరువుల వినియోగంతో పాటు నానో యూరియా, నానో డీఏపీ, నానో పొటాష్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సమతుల్య ఎరువుల వినియోగం, నీటి సంరక్షణ, సుస్థిర పోషక నిర్వహణ పద్ధతులను పాటించాలని, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి మధులిక మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు యాజమాన్య పద్ధతులు, ఉల్లి పంట సాగు, మార్కెటింగ్ అవకాశాలు, ప్రభుత్వం అందించే రాయితీల గురించి వివరించారు. కూరగాయల సాగులో పాటించాల్సిన మెళకువలను తెలియజేశారు. డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు అవసరమైన రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ వంతడుపుల కస్తూరి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో గ్రామంలో భూగర్భ జలాల నిల్వలు రోజురోజుకూ తగ్గుతున్నాయని, రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. నీటి నిల్వలను పెంచుకునేందుకు ఇంకుడు గుంతలు, వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్స్ నిర్మించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి భూమిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని భూగర్భ జలాల పరిస్థితిని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో చెల్పూర్ గ్రామ సర్పంచ్ వంతడుపుల కస్తూరి, ఉపసర్పంచ్ నేరెళ్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు, ఏఈఓలు రాంప్రసాద్, సతీష్, అనూష, పీఏసీఎస్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

-గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టాలి
-జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 12 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు పీసీపీఎన్‌డీటీ (ప్రజ్ఞాచీణు) చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ అధికారులను ఆదేశించారు.నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా కేంద్రంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ అధ్యక్షతన జిల్లా స్థాయి పీసీపీఎన్‌డీటీ సలహాకమిటీ సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా జిల్లాలో చట్టం అమలు తీరు, స్కానింగ్ కేంద్రాల నిర్వహణ,నిబంధనల పాటింపుపై సమీక్షించారు.ఈ సమావేశంలో నూతన స్కానింగ్ కేంద్రం రిజిస్ట్రేషన్‌కు కమిటీ ఆమోదం తెలిపింది.పీసీపీఎన్‌డీటీ విభాగం పనుల నిర్వహణ సులభతరం చేసేందుకు కంప్యూటర్,ప్రింటర్ కొనుగోలుకు నిర్ణయించింది. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, ఈ నేరానికి పాల్పడిన వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు.జిల్లాలోని అన్ని స్కానింగ్‌కేంద్రాలు చట్ట నిబంధనలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాల్లో పీసీపీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, ఫారాలను సక్రమంగా నిర్వహించాలని,చట్టానికి సంబంధించిన పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, స్కానింగ్ పరీక్షల ధరలు, సంబంధిత వైద్యుల పేర్లు, అర్హతల వివరాలను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని స్పష్టం చేశారు.

మాతృ మరణాలపై సమీక్ష.

అనంతరం మాతృ మరణాల సమీక్ష సమావేశం నిర్వహించారు. నెరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నమోదైన ఒక మాతృ మరణ కేసును కమిటీ సభ్యులు సమగ్రంగా సమీక్షించారు.గర్భిణీలను గర్భధారణ ప్రారంభ దశలోనే గుర్తించి నమోదు చేయాలని, హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. వైద్యుల సలహా మేరకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను క్రమం తప్పకుండా వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు.గర్భిణీలకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించడం, రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవడం,ప్రమాదకర గర్భధారణ లక్షణాలను ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం అందించడం ద్వారా మాతృ మరణాలను నివారించవచ్చని పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రోగ్రాం అధికారి నాగేంద్రబాబు, జీజీహెచ్ సిరిసిల్ల గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. సుగుణ, వేములవాడ ఏరియా ఆసుపత్రి సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ సంగీతారెడ్డి, డాక్టర్ పరమేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్, ఐఎంఏ సిరిసిల్ల ప్రతినిధి డాక్టర్ సీహెచ్. సంతోష్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సీహెచ్. భాస్కర్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, వైద్యాధికారి చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ చొక్కా మాటున నిజాయితీ వెలుగు

పోగొట్టుకున్న పర్సును అప్పగించిన హుజూరాబాద్ ట్రాఫిక్ పోలీసులు
-హెచ్‌జీలు శ్రీనివాస్, సంపత్‌లపై సర్వత్రా ప్రశంసల జల్లు



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 12 : విధి నిర్వహణలో అప్రమత్తతతో పాటు నిజాయితీని చాటుకుని హుజూరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మరోసారి ప్రజల మన్ననలు పొందారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎం.డి. అంకుశావలి అనే వ్యక్తి తన పర్సును పోగొట్టుకున్నారు. ఆ పర్సులో విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, ముఖ్యమైన పత్రాలు ఉన్నట్లు తెలిపారు. ట్రాఫిక్ విధుల్లో ఉన్న హోంగార్డులు శ్రీనివాస్, సంపత్ ఈ పర్సును గుర్తించి, సమీపంలోనే ఉన్న బాధితుడికి అప్పగించారు. ఈ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోంగార్డులు శ్రీనివాస్, సంపత్‌ల కంట ఆ పర్సు పడింది. తక్షణమే స్పందించిన వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ పర్సును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం ఎస్ఐ రవి సమక్షంలో పర్సులోని విలువైన వ్యక్తిగత గుర్తింపు కార్డులు, నగదును ఏమాత్రం చెక్కుచెదరకుండా దాని అసలు యజమాని ఎం.డి. అంకుశావలికి సురక్షితంగా అందజేశారు. అక్రమాలకు తావులేకుండా, బాధ్యతాయుతమైన ప్రవర్తనతో పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచిన హెచ్‌జీలు శ్రీనివాస్, సంపత్‌లను ఎస్ఐ రవితో పాటు పట్టణ ప్రజలు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు. పోగొట్టుకున్న విలువైన వస్తువులు తిరిగి దక్కడంతో బాధితుడు అంకుశావలి పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మురికి కాలువలతో దుర్వాసన.. ప్రజల అవస్థలు

-గురువారం సంత ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తాచెదారం.. చేపల వ్యర్థాలతో పెరుగుతున్న అపరిశుభ్రత



చురకలు ప్రతినిది ఎల్లారెడ్డిపేట నవంబర్ 12 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో అపరిశుభ్రత సమస్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన, ప్రతి గురువారం కూరగాయల సంత నిర్వహించే ప్రాంతంలోని 11వ వార్డులో మురికి కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో మురుగునీరు ముందుకు వెళ్లక నిలిచిపోవడంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది.ఇదే ప్రాంతంలో చేపల విక్రయాలు నిర్వహించే వ్యాపారులు చేపలను శుభ్రం చేసిన అనంతరం వాటి వ్యర్థాలను కాలువల పక్కన పడవేస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారం, చేపల వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో అటుగా వెళ్లే ప్రజలు, సంతకు వచ్చే కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చిపోయే సంత ప్రాంతంలోనే పారిశుద్ధ్య సమస్య నెలకొనడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువల్లో మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి 11వ వార్డులోని మురికి కాలువలను శుభ్రం చేయించాలని, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. చేపల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా వ్యాపారులకు సూచనలు చేయడంతో పాటు, ప్రతి గురువారం సంత జరిగే ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లపై కలెక్టర్ సమీక్ష



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 12 : అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందించడంతో పాటు, లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సోన్ మండలంలోని సంగెంపేట్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్లకు కల్పించిన విద్యుత్, రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇళ్లలో నివసించేందుకు అవసరమైన అన్ని వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేయడం ద్వారా భూగర్భ జలాలను సంరక్షించవచ్చని ,ఈ దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం గ్రామస్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ వికసిత్ భారత్ – ఉపాధి, జీవనోపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, గృహ నిర్మాణ శాఖ డీఈ గంగాధర్, సర్పంచ్ విలాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్నికల పోటీలు : ఆర్డీవో



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 12 : విద్యార్థులు,యువ ఓటర్లలో ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన, ప్రశ్నోత్తర పోటీలు నిర్వహించనున్నట్లు నిర్మల్ ఆర్డీవో, ఎన్నికల నమోదు అధికారి దేవిదాస్ తెలిపారు.ఎన్నికల అక్షరాస్యత సంఘాల ఆధ్వర్యంలో 009–నిర్మల్ శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.నవంబర్ 13వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్మల్‌లోని భాగ్యనగర్ నారాయణ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు.సంబంధిత అధికారులు, పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను సకాలంలో పోటీలకు పంపించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో దేవిదాస్ కోరారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభంపై వివాదం



చురకలు విలేకరి, మల్లాపూర్, నవంబర్ 12 : మల్లాపూర్ మండలంలోని గుండంపల్లి గ్రామంలో రెండో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన ప్రారంభోత్సవంపై వివాదం నెలకొంది. ఈ నెల 19న భవనాన్ని ప్రారంభించనున్నట్లు అంగన్‌వాడీ టీచర్ ఎ.రాధ గురువారం పేర్కొనడం చర్చకు దారితీసింది. అయితే ప్రారంభోత్సవ తేదీ ఖరారుపై గ్రామ సర్పంచ్‌తో పాటు పంచాయతీరాజ్ శాఖ, డీడబ్ల్యూవో, మండల స్థాయి అధికారులకు సమాచారం ఉందా లేద అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా సంబంధిత అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండానే ప్రారంభోత్సవ తేదీ ఎలా నిర్ణయించారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సూపర్‌వైజర్ సూచనల మేరకే తేదీ ఖరారైందంటూ టీచర్ పేర్కొనడం మరింత చర్చనీయాంశమైంది. ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం ప్రారంభోత్సవం విషయంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయం కొరవడిందనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

నియోజకవర్గ స్థాయి వ్యాసరచన క్విజ్ పోటీలు

-ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోటీలు



చురకలు ప్రతినిధి హుజూరాబాద్

నవంబర్ 12 : హుజురాబాద్ పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం పక్కనున్న రిక్రియేషన్ క్లబ్లో హుజురాబాద్ నియోజకవర్గ స్థాయి పోటీలను తెలంగాణ ఎలక్షన్ కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నిర్వహించారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రాముఖ్యత, ఓటింగ్ ప్రాముఖ్యత గురించి వ్యాసరచన, ఓటర్ల జాబితా తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, పోలింగ్ ప్రక్రియ, కౌంటింగ్ ప్రక్రియల పైన 50 ప్రశ్నలతో కూడిన క్విజ్ విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తహసిల్దార్ జక్కని నరేందర్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులు వ్యాసరచన క్విజ్ పోటీలలో పాల్గొని చక్కగా రాసి ఈనెల 17న జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని విజేతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులకు ఎన్నికలపై, ఎన్నికల నిర్వహణపై అవగాహన కలుగుతుందని అన్నారు. మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లంతకుంట మరియు కమలాపూర్ మండలాల నుంచి ప్రభుత్వ కళాశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులు 56 మంది ఈ పోటీలకు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ బాలకిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కపల్లి బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో

ఘనంగా జాతీయ దేవాలయ ప్రవేశ దినోత్సవం

-దేవుడు అందరివాడు.. దేవాలయం అందరిదీ

-మోర శ్రీనివాస్



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట

నవంబర్ 12 : సామాజిక సమరసత, సమానత్వం, ఐక్యతను చాటిచెప్పే లక్ష్యంతో సామాజిక సమరసత వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో జాతీయ దేవాలయ ప్రవేశ దినోత్సవాన్ని ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని స్వయంభూ శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక కరీంనగర్ విభాగ్ సహ సంయోజక్ మోర శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేవుడు అందరివాడని, దేవాలయం అందరిదని, కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ దేవాలయ ప్రవేశ హక్కు ఉందని పేర్కొన్నారు. కార్తీక మాసంలో అందరూ కలిసికట్టుగా ఆలయానికి వచ్చి భగవంతుడిని దర్శించుకోవడం ద్వారా సమాజంలో సమరసత, సమానత్వ భావనలు బలపడతాయని అన్నారు. భగవంతుని దృష్టిలో మానవులందరూ సమానులేనని, మనమంతా భారతమాత ముద్దుబిడ్డల మని తెలిపారు. 1936 నవంబర్ 12న కేరళలోని ట్రావెన్కోర్ సంస్థాన చివరి మహారాజు శ్రీ చితిర తిరునాళ్ బలరామ వర్మ తన సంస్థాన పరిధిలోని దేవాలయాల్లో కులాలకు అతీతంగా అందరికీ ప్రవేశం కల్పిస్తూ చారిత్రాత్మక ప్రకటన జారీ చేశారని గుర్తుచేశారు. అప్పటివరకు వెనుకబడిన, అణగారిన వర్గాల ప్రజలపై ఉన్న దేవాలయ ప్రవేశ నిషేధాన్ని ఈ ప్రకటన తొలగించిందని, భారత సామాజిక సంస్కరణల చరిత్రలో ఇదొక గొప్ప మైలురాయిగా నిలిచిందని వివరించారు. తిరుమల, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో సైతం గిరిజన చెంచు సమాజానికి విశిష్టమైన ఆధ్యాత్మిక సంబంధం ఉందని గుర్తుచేస్తూ, సమాజంలోని ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. స్వార్థపూరిత శక్తులు కులాల మధ్య విభేదాలు సృష్టించి గ్రామాలు, పట్టణాల్లో ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉంటూ దేశ సమగ్రత, సమైక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక బాధ్యులు కోడం రవి, ఎర్రోజు శ్రీనివాస్, నిర్వాహకులు గోగూరి ప్రదీప్ రెడ్డి, జిన్నా లక్ష్మీరాజం, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో పరిస్థితులపై హుజురాబాద్‌లో ప్రత్యేక సమీక్ష

-కలెక్టర్ ఆదేశాల మేరకు త్రాగునీటి ఎద్దడి నివారణపై అధికారుల కసరత్తు



చురకలు ప్రతినిధి హుజూరాబాద్

నవంబర్ 12 : ఎల్‌నినో ప్రభావం కారణంగా రాబోయే రోజుల్లో త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ఆదేశాల మేరకు మేరకు హుజురాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి, మండల ప్రజా పరిషత్తు ప్రత్యేక అధికారి జల కుమారి నాయక్వాడి అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని త్రాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలన్నీ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని, వాటి ప్రస్తుత స్థితిగతులను ఎప్పటి కప్పుడు సమగ్రంగా అంచనా వేయాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా,వివేకవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎల్‌నినోపై ప్రత్యేక సమీక్ష ముగిసిన అనంతరం,ప్రతి 45 రోజులకు ఒకసారి నిర్వహించే మండల ప్రజా పరిషత్తు సాధారణ సమీక్షా సమావేశాన్ని ఆర్డీవో నిర్వహించారు.ఈ సమావేశంలో మండలంలోని వివిధ ప్రభుత్వ పథకాలు ,అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ, ఉద్యానవన, మిషన్ భగీరథ, ఇరిగేషన్ శాఖల అధికారులు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఎంపీడీఓ, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల సంక్షేమానికి

కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది



-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

చురకలు ప్రతినిధి, జగిత్యాల,

నవంబర్ 12 : ఆడబిడ్డల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన 57 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన రూ.57 లక్షల విలువగల చెక్కులను గురువారం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడపిల్లల వివాహానికి ఆర్థికంగా అండగా ఉండేందుకే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి దళారులను నమ్మవద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాల అమలు వేగవంతం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, తహసీల్దార్ రామ్మోహన్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, ఆడువాల లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ దుమాల రాజ్ కుమార్, జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, డీసీసీ ఉపాధ్యక్షులు రవీందర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

చురకలు విలేకరి,బీర్‌పూర్,

నవంబర్12 : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, పంచాయతీ భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పేర్కొన్నారు.బీర్‌పూర్ మండలం చిన్న కొల్వాయి,కండేనకుంట గ్రామాల్లో రూ. 20 లక్షల చొప్పున నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని,ప్రతి గ్రామంలో మౌలిక వసతులకల్పనకు కృషి చేస్తున్నానన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు,తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు పాలన అందుబాటులో ఉండేలా గ్రామ పంచాయతీ భవనాలు ఉపయోగపడ తాయని,అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొడసం గంగవ్వ ఈశ్రు, నర్సయ్య, ఎంపీడీఓ భీమేష్, ఎంపీఓ మధు, జిల్లా కేడీసీసీ డైరెక్టర్ ముప్పాల రామచంద్రరావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు హర్షకోట రాజగోపాల్ రావు, పాక్స్ చైర్మన్ నవీన్‌రావు,మండల పార్టీ అధ్యక్షులు నారపాకరమేష్, సర్పంచులు రంగు లక్ష్మణ్, కొనపెల్లి శేఖర్, చిక్రం మారుతి, తోట శ్రీనివాస్, చల్ల లక్ష్మణ్, బనుక సతీష్, ఎడ్ల సుశీన్, తొగిట సురేందర్,బోడసాగర్,పుర్క రామచందర్ , మాజీ సర్పంచులు నల్ల మహిపాల్ రెడ్డి, దోసారపు శ్రీనివాస్, చుంచు నరేందర్, నాయకులు రామకిష్టు గంగాధర్,లింగన్న, శ్రీనివాసరావు, అనిల్, మెరుగు రాజేశం,దండికె తిరుపతి, శీలం రమేష్,రవి,బద్ది భీమన్న, లస్మయ్య,చిక్రం రాంసాబ్,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు, నాయకులు ,కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.